# ప్రేమతత్వం!!

శ్రీ "లోకం"

★

అమావాస్య కారుచీకట్లు.

అర్ధరాత్రి.

నిశ్శబ్దత

నికొలాస్ హృదయంలో పరాభవతిమిరం.

కారుచీకట్లు చీల్చుకొంటూ సమాధిచేరాడు. సమాధిమధ్యనున్న వో గచ్చుదిమ్మమీదాసీనుడయ్యాడు.

గుడ్లగూబల వికృతఘోష.

మధ్యమధ్య కొరవిదయ్యాల మంటలు.

మంటలవెల్తుర్లో సమాధులపై "ఆత్మకు శాంతి" అనే అక్షరమార్పు గోచరం.

నికొలాస్ హృదయంలో ఆవేదన అశాంతి! నిరాశ! ఆహా!

"నేను జీవశ్శవాన్ని. నా ఆత్మకు శాంతి లేదు. అబ్బా! లిల్లీ, ఇలాఅని కల్లో నేనా అనుకోలేదు. ఎన్నాళ్ళనుంచో నీవే నా ప్రేమదేవతవని నా విశాలహృదయపీఠంమీద నిన్ను ప్రతిష్ఠించి ఉపాసిస్తున్నా. కాని తృ...ణీ...కా...రం! 'Get away wise fool'!! ఎంతమాటన్నావ్ లిల్లీ. ఛీ బ్రతుకా. ఇల్లాటిబ్రతుకు బ్రతికేకన్న సస్తేనే లోకం హర్షిస్తుంది. (సమాధుల్ని చూస్తూ) తోడిమానవులారా! మీకెంత శాంతి. ఆహా యెంత నిశ్చింతగా నిద్రపోతున్నారు. ఓ భగవానుడా నా ఆత్మకు శాంతిని చేకూర్చవా? నేనేం పాపంచేశాను? శాంతిస్వరూపులమధ్యనున్న నాకా అశాంతి!" అని విలపింపసాగాడు లిల్లీచేత తృణీకరింపబడ్డ ప్రేమికుడు నికొలాస్.

చిన్నసడి. సమాధుల్లో యేదో సంభాషణ. నికొలాస్ జాగ్రత్తగావినడం మొదలెట్టాడు.

"ఇంత చిన్నవయస్సులో నీకిక్కడికివచ్చేగతేం పట్టిందమ్మాయ్" అని ఓ పురుషస్వరం.

"ప్రేమ. నిర్మలప్రేమ. జీవనజ్యోతి" అని ఓ యువతి కంఠధ్వని.

"ప్రేమా! ఇదాతావు ప్రేమకు."

"ఔను. ఇదే. నేనో తృణీకరింపబడ్డ ప్రేమజీవిని. ఆత్మశాంతికోసం యిక్కడికి వచ్చేశా."

"ఆఁ. అమ్మాయ్. నేను నీకసహాయభూతుణ్ణి. నేనూ నీవలె ప్రేమసంపాయించలేని అభాగ్యుడను. అమ్మాయ్, ఈ అసందర్భపు చావులకు, మన యీ దుర్గతులకు సంఘదురాచారాలే. కాస్త్రీయమైన పిచ్చినమ్మకాలే హేతువులు...?"

"నేను సుమారు పాతికేళ్ళక్రిందట వో సామాన్యకుటుంబంలో పుట్టేను. నేను నిజంగా ఆగర్భశ్రీమంతుణ్ణి. నా తల్లిదండ్రులకు నేనొక్కణ్ణే అవటంచేత నాకాడిందాట పాడిందిపాట అయేది. నాతోటే ఓ అమ్మాయి ఎఫ్. ఏ. సీనియర్ చదువుతుండేది. అప్పటికి నాకు సుమారు 20 ఏళ్లు. సహాధ్యాయులంకావటం మూలాన మాకు మైత్రికల్పింది. కాలంనడుస్తున్నకొద్దీ మైత్రి ప్రేమరూపందాల్చింది. నేనామెను మనసారా ప్రేమించాను. ఆమె నన్నూ ప్రేమించింది. మేమిద్దరం ఒహర్నొహరం మనసారా ప్రేమించుకొన్నాం. ఎడబాటు దుర్భరంగా వుంటుండేది. తుదకు పెండ్లిచేసికుందుకు నిశ్చయించుకొన్నాం. కాని...ఆమె తల్లిదండ్రులు, ఆమెకిష్టంలేకపోయినా బలవంతంగా ఆమెనో లక్షాధికారికిచ్చి పెండ్లిచేశారు. అమ్మాయ్, నాస్థితి ఎల్లావుంటుందో చెప్పా? ఆమెకా సంసారం నరకకూపం. ఏం చేస్తుంది. దైవంవిధించిన భర్త. కాని ఎల్లాఔతేనేం కొన్నాళ్ళకి సుఖజీవనంజీవిస్తుండేది. ఇల్లా ఆమెఒకరిసొత్తయినా, నేనామెను మనసారా ప్రేమిస్తుండేవాణ్ణి. కాని నా తలిదండ్రులు ఓ ప్లీడరుగారమ్మాయిని పెళ్లాడమని వేచుకుతింటుండేవారు. కాని నాకిష్టంలేకపోయేది. ఆమెకు సహజసౌందర్యం లేకపోయినా పైతళుకులవల్ల బాగానేవుండేది, మంచి గాయకురాలు. ఏమైతేనేం లాభం? ఆమెఅంటే నాకిష్టంలేకుండా వుండేది. అని సమాధిలోంచి

ఓ స్త్రీకంఠధ్వని "ఆయిన మీసహాధ్యాయి, ఇంకా మిమ్మల్ని ప్రేమిస్తోందా" అని. "ఔను ఆమె నన్నిప్పటికీ మనసారా ప్రేమిస్తుంది. నేనామెకు దూరమైనా నా యోగక్షేమాలు నా స్నేహితుల ద్వారా తెల్సుకుంటుండేది. నన్నే ఆమె మనోనాథునిగా వుపాసిస్తుంటుండేది" అని పురుషస్వరం,

స్త్రీస్వరం—(సమాధిలోంచి) "అహా ఎంత నిర్మల ప్రేమ! ఈ నీచసంఘపు అర్థంలేని కట్టుబాట్లేగదా యీ బలులకు హేతువులు...అయితే మీరు ప్లీడరుగారమ్మాయి నెందుకు పెళ్లాడలేదూ మరి?"

పురుషస్వరం—నేను నా హృదయంలో యింకో ఆమెకు స్థానమిచ్చిన వెనుక ప్లీడరుగారమ్మాయి నెల్లా పెండ్లాట్టం?

స్త్రీ స్వరం :—నిజమే. మంచిపని చేశారు. ఒకవేళ మీరామెను పెళ్లాడుంటే, ఆమె జీవితం యెడారిలో యెండమావే కదూ.

మళ్ళా సమాధిలోంచి పురుషస్వరం తన జీవితగాథ మొదలెట్టింది:

ఇలా అయిన కొంతకాలానికి నా తండ్రి స్వర్గస్థుడయాడు. గోరుచుట్టుమీద రోకటిపోటు. నేనీ ప్రపంచంలో యిహ యేవరికోసమున్నట్టు. నా తండ్రి చనిపోయిన కొద్దికాలానికే నాకు టైఫాయిడ్ జ్వరం వచ్చింది. అంతే. ఇదే నా జీవిత చరిత్ర. ఇహ యీ సమాధే నా నివాసం" అని సమాధిలోని యువకుడు తన జీవిత చరిత్ర ముగించాడు.

క్షణికం నిశ్శబ్దం.

నికోలాస్ యింకా ఆత్రుతతో చెవియొగ్గి వింటున్నాడు సమాధులవయిపు.

సమాధిలోంచి స్త్రీ స్వరం (యువతి) తన కథ మొదలెట్టింది:

నేను జన్మించి యిరవయ్యేళ్ళవుతుంది. నా తండ్రి న్యాయవాది. నాకు నా తండ్రి యెంతో డబ్బు వెచ్చించి సంగీతం చెప్పించాడు. సంగీతంలో 'మేటి' పురుషస్వరం వెల్వడుతుంటే, ప్రక్కసమాధిలోంచి అనిపించుకొన్నా. సభలకుగాని క్లబ్బులకుగాని నా తండ్రి నన్ను తీసికెళ్ళి నాచేత పాడించి, అందరూ మెచ్చుకుంటుంటే యెంతో గర్వపడేవాడు. ఒకనాడు కాలేజీలో నేను నా గానకళ నిరూపించవలసి వచ్చింది. అందరూ మెచ్చుకున్నారు. అపుడే ఆ సభికుల గుంపులో వో మెరుపు. తేరిబారి చూశాను. ఆ సుందరుడు తదేకధ్యానంతో నావైపు చూస్తున్నాడు. సిగ్గుచే తలవంచుకొన్నాను. మళ్ళా తలెత్తేసరికి ఆయన పెదిమలమీద చిరునవ్వు నా పెదిమలమీదకి పరుగులెత్తింది. అంతే! Love at first Sight.

నేనాయనను మనసారా ప్రేమించాను. నిజముగా ఆయన నాకన్నందగాడయినా, కాని ఆ సుందరుడు నన్ను ప్రేమించినట్టు కన్పడలే. ఐనా నేను నిరాశ చెందక, ఆయనే నా మనోనాథుడను కొంటూండేదాన్ని. కొన్నాళ్ళకు ఆయనో కాలేజీ గర్లును ప్రేమిస్తున్నట్టు, కాని ఆమె తలిదండ్రులు ప్రోత్సాహమువల్ల (ఆమెకిష్టంలేకపోయినా) వో లక్షాధికారికర్ధాంగయిందని తెలుసుకొన్నా.

ఇంతలో నా తండ్రీ హరీమన్నాడు. మరి కొన్నాళ్ళకు తమ్ముణ్ణీ, నన్నూ వదలి తల్లి స్వర్గపథం పట్టింది. నా తమ్ముడు బుద్ధిమంతుడుకాక వూరి పోరంబోకులతో తిరిగి చెడ్డలవాట్లకులోనై కృంగి కృశించి చనిపోయాడు. ఇహ మిగిలింది నేను. అభాగ్యజీవిని అని తనకథ చెబుతుండగా సమాధి యువకుడు, భగవంతుడొక్కొక్కప్పుడు నిర్దయుడు. కష్టాలన్నీ వొక్కసారొస్తుంటాయి.

సమాధి యువతి :—కాదు కాదు. భగవంతుడు దోషికాడు. దయామయుడు. ఈ కష్టాలన్నిటికీ కారణం సంఘరాక్షసి. ఈ రక్కసి భీకరనినాదంతో గుండెచప్పుడు టక్కునాగిపోయి యిల్లాంటి గతులు పడుతాయి. ఇహ నాకథ వినండి,

నేనేకాకినవగానే కొందరు యువకులు నన్ను చేపట్టాలని ప్రాకులాడేరు. కాని వాళ్ళ

నెప్పుడూ అరమైలు దూరంలో వుంచేదాన్ని.

ఇలా వుంటుండగా వోనాడు,

నా ప్రేమికుడు—ఎందరు నన్ను విడిచినా యెవర్నయితే నా హృదయదేవునిగా పూజిస్తున్నానో అతడు...అబ్బా! చనిపోయాడని విన్నాను. నా గుండె బ్రద్దలయింది. నా జీవనజ్యోతి ఆరిపోయింది.

ఓనాటి అర్ధరాత్రి. నా మనోనాధుని ఫోటో నా హృదయానికి హత్తుకుంటూ, హాయిగా నిశ్చింతగా సీసాలోని విషాన్ని నోట్లో పోసుకున్నా. ఇంకేం? నా తల్లో! నా తండ్రీ, తల్లీ, తమ్ముడూ అందరూ గిర్రున తిరిగారు, కండ్లు చీకట్లు కమ్మాయి అంతే.

నిర్మలప్రేమతో జీవితం అంతం.

ఇక్కడకొచ్చేశా.

అని సమాధియువతి తన జీవిచరిత్ర ముగించింది.

కొన్ని శెకెండ్లు నిశ్శబ్దత.

"మేరీ" అని సమాధి యువకుడు సంభ్రమాశ్చర్యాలతో అన్నాడు.

"ఆర్థర్" అని సమాధి యువతి ప్రేమపూరిత స్వరం.

సమాధియువకుడు—మేరీ. నీవే గెల్చావ్. నీవే నిజమైన ప్రేమికవు. నిర్మలప్రేమ! నాతో కూడా సమాధి చేరావు. ఇదుగో మన స్నేహబృందం మధ్య నిన్ను నా భార్యగా స్వీకరిస్తున్నా."

నికొలాస్ లేచి నుంచున్నాడు. సమాధి సంభాషణ చెవులార విన్నాడు.

"బోధ! ప్రేమతత్వం......దయామయుడా నాకీ శాంతిమందిరంలో, సమాధిలో చోటివ్వవా" అంటూ నుంచున్నపాటునే నేలకొరిగాడు.

(ఒక ఆంగ్లకథ చదివి)


# శక్తిమయి

శరీరములో ఉష్ణరక్తము యెంత సమృద్ధిగా వుంటే మానవజీవితం అంత ఉషారుగ, ఉత్సాహంగ, సుఖమయంగా వుంటుంది. సాధారణంగా కొంతమంది రక్తం చెడిపోయిదండి అనడము మామూలు. ఇది తప్పు అభిప్రాయము. రక్తము చెడడమంటూ లేదు; అది కొరవడుటనే మనవారు చేడడముగా భావిస్తున్నారు. పైగా రక్తములోని రెడ్ కార్పసిల్సు యెంత యెక్కువయితే రక్తము అంత ఉజల్వంగా వుంటుంది. ఈ రక్తము శరీరములో వృద్ధి కావడానికి శక్తిమయి యెంతో ఉపకరిస్తుంది. శరీరము నిగనిగలాడుతూ నిండుయవ్వనముతో తొణికిసలాడుతూ వున్నప్పుడే మానవునకు నిండు సౌఖ్యము. నీరసానికి అవకాశము యివ్వనినాడే మానవునకు నిండు ఆనందము. శక్తిమయి మీకు కావలసిన శాశ్వత ఆనందము, అందము, ఆరోగ్యం. బలంయిచ్చ్యుడంలో దీనిని మించినదిలేదు. పత్యము లేదు.

## ఈ క్షణమే శక్తిమయి తెప్పించి వాడండి.

శక్తిమయి 20 రోజుల లేహ్యాం 3 రూ. 40 రోజులకు 5 రూ. పోస్టేజి 8 అ. కేటలాగు ఉచితం. మీావూరు మందులషాపులో దొరకకపోతే సగం డబ్బు ముందుగా పంపుతూ క్రింది అడ్రసుకు వ్రాయండి:

సూరజ్ ఫార్మసీ. 147, తిరువత్తియూర్ హైరోడ్డు, వాషర్ మెన్ పేట, మద్రాసు.